www.prajasakti.com

గురువారం 25 జనవరి 2024

5

ఏలూరు



నేడు జిల్లాకు షర్మిల రాక



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఈ నెల 25వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తొలిసారిగా ఏలూరు రానున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా గన్ బజార్, ఆదివారపు పేట, తంగెళ్లమూడి మీదుగా కండ్రికగూడెం సెంటర్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం చింతలపూడి రోడ్డులోని సుభీక్ష కళ్యాణ మండపంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

పునాది వేశారు.. వదిలేశారు..!

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని బొర్రంపాలెం ఆసుపత్రి భవనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఆసుపత్రి కోసం పదేళ్లుగా యువకుని పోరాటం



నిర్మాణ దశలోనే ఉన్న ఆసుపత్రి భవనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం కనీస అవసరాలు అందుబాటులో ఉంటే ప్రజలు సంతోషంగా జీవించొచ్చు. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా వాటి అమల్లో కొందరి నిర్లక్ష్యం కారణంగా వారికి విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలంటే అన్ని రకాల వైద్య సదుపాయాలూ ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్య, వైద్యం విషయంలో రూ.కోట్లు వెచ్చించి విలేజ్ క్లినిక్ వంటి భవన నిర్మాణాలు చేస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ మండలంలోని బొర్రంపాలెంలో ప్రభుత్వాసుపత్రి భవనం నిర్మాణం విషయంలో గ్రామస్తుల పదేళ్ల కలను మాత్రం నెరవేర్చలేకపోతోందని పలువురు చెప్పుకుంటున్నారు.

బొర్రంపాలెంలో నిర్మిస్తున్న 15 పడకల ఆసుపత్రి భవనమే దీనికి ఉదాహరణ. 12 ఏళ్ల క్రితం మంజూరైన ఆసుపత్రి భవనం నేటికీ పూర్తి కాలేదని, ప్రభుత్వాలు మారినా తమ గోడు పట్టించుకున్న నాథుడు లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో జంగారెడ్డిగూడెం, ఏలూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, అటువంటి సమయాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ దశలోనే ఉన్న ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేసి పంచాయతీ ప్రజలందరికీ సౌకర్యవంతమైన వైద్యం అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బొర్రంపాలెం గ్రామం మండలంలో అధిక జనాభాతో పాటు వ్యాపార రంగంలో ముందున్న పెద్ద పంచాయతీగా పేరొందింది. అటువంటి పంచాయతీ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షాగా మారుతోంది. గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో 2011లో అప్పటి ప్రభుత్వం పది పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.70 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే స్థల సేకరణలో జాప్యం వల్ల నిర్మాణం చేపట్టలేదు. తిరిగి 2016లో అప్పటి ప్రభుత్వం 15 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి రూ.1.49 కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ స్థల సేకరణలో కొన్ని వివాదాలు చోటు చేసుకోగా నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో ప్రస్తుత అధికార పార్టీ వైసిపి అధికారం చేపట్టిన తరువాత గ్రామస్తులు ఒత్తిడి తేవడంతో స్థానిక నాయకులు ఎంపీ, ఎంఎల్ఎ సహకారంతో 2021 మార్చి 16న నిర్మాణ పనులు చేపట్టారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి పునాది వేశారు గానీ నిర్మాణం మాత్రం పూర్తి చేయలేదు. గ్రామంలో చిన్నపాటి ప్రభుత్వాసుపత్రి ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసరమైతే ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని, డబ్బులు లేని పేదలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఆసుపత్రి కోసం 12 ఏళ్లుగా యువకుని పోరాటం

గ్రామంలో ఆసుపత్రి భవనం నిర్మించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కోరుతూ గ్రామానికి చెందిన పొట్టేళ్ల మురళీకృష్ణ 12 ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నారు. 2011లో తన సోదరుడు పాము కాటుకు గురవ్వడంతో గ్రామంలో సరైన వైద్య సేవలు లేకపోవడంతో జంగారెడ్డిగూడెం తరలిస్తుండగా మార్గమధ్యంలో అతడు మృతి చెందాడు. మనస్తాపానికి గురైన మురళీకృష్ణ తన సోదరుడు వలే ఎవరూ చనిపోకూడదని గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు ఉంటే తన సోదరుడు చనిపోయేవాడు కాదని భావించిన అతడు అప్పటి నుంచి ఆసుపత్రి భవనం నిర్మాణం కోసం పోరాడుతూనే ఉన్నారు. తన ద్విచక్ర వాహనానికి ఫ్లకార్డు కట్టి ప్రచారం చేస్తున్నాడు. గ్రామంలో సంతకాలు సేకరించి పాలకులకు వినతులను అందిస్తూ, స్పందనలో సైతం ఫిర్యాదులు చేశారు. ఆయనతోపాటు గ్రామంలో యువకులు సైతం ఫిర్యాదులు చేశారు. గ్రామానికి వైద్య సదుపాయాలు కల్పించాలని యువకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆసుపత్రి భవనం వెంటనే నిర్మించాలి

పొట్టేలు మురళీకృష్ణ, బొర్రంపాలెం



గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఆసుపత్రి భవన నిర్మాణం వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి. 2011 నుంచి వివిధ దశల్లో ఆగిపోతూ వచ్చింది. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో మా అన్నయ్య చనిపోయాడు. అలా ఎవరికీ జరగకూడదనే నా వేదన. అధికారులు స్పందించాలి. పాలకులు బాధ్యత తీసుకోవాలి.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ కనీస సదుపాయాలు లేకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరు నాటికి ప్రతి పోలింగ్ బూత్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అదే విధంగా తుది ఓటర్ల జాబితాను రూపొందించినట్లు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని సిబ్బందికి తెలిపారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముచ్చటిస్తూ పాఠాలు బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సూర్యతేజ, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఓటర్ల దినోత్సవం ఈ నెల 25వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం హాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల ప్రదానం చేస్తారని, సీనియర్ ఓటర్లకు, వికలాంగ ఓటర్లను సన్మానిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు విజేతలకు ముఖ్యఅతిథిచే బహుమతులు అందించడం జరుగుతుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని..

సెర్ఫ్ ఉద్యోగుల నిరసన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి సెర్ఫ్ ఉద్యోగుల జెఎసి చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ కేడర్లు, పేస్కేల్‌ను సక్రమంగా నిర్ణయించి ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరు చేసిన పోస్టులపై వెంటనే జిఒ ఇవ్వాలని, ప్రస్తుత సీలింగ్ విధానానికి బదులుగా 100 శాతం బేసిక్ పే పై ఇపిఎఫ్ కాంట్రిబ్యూషన్ అమలు చేయాలని, రిజర్వేషన్ల నియమాన్ని సక్రమంగా వర్తింపజేస్తూ అర్హత కలిగిన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని తదితర డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ పోరాడుతామని తెలిపారు. జెఎసి మెంబర్ కన్వీనర్ హేమంత్ కుమార్, కన్వీనర్ బాపూజీ, గోపి, అనిత, లతా, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

కొనసాగిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు



దీక్షలకు మద్దతు తెలుపుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ యజమాన్య హక్కుల చట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్) తీసుకొచ్చిందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. దీక్షలకు రైతు సంఘం తరపున శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. భూ యాజమాన్య హక్కుల చట్టం తక్షణం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు నీతి అయోగ్ రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో అమలు చేయాలని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జిఒ 512 జారీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. రైతులు, ప్రజలు ఈ చట్టం ద్వారా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూ వివాదాలకు సంబంధించిన పరిష్కారం రెవెన్యూ అధికారులకే కట్టబెడుతూ ఈ చట్టంలో నిబంధనలు రూపొందించారని చెప్పారు. తమకు అన్యాయం జరిగితే కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేయడం తగదన్నారు. సమగ్ర భూ సర్వేలో వస్తున్న సమస్యలకు ఎటువంటి పరిష్కారం చూపకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాజ్యాంగ హక్కులను సైతం తుంగలో తొక్కి రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే భూ యాజమాన్య హక్కుల చట్టం జిఒ 512ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు ప్రజలు న్యాయవాదులు ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఎఇ వివేకానంద సస్పెన్షన్

చింతలపూడి : చింతలపూడి గృహనిర్మాణశాఖ ఎఇ వివేకానందను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో ఎఇ వివేకానంద గృహనిర్మాణ శాఖలో అవకతవకలపై విచరణ జరిపించి చర్యలు తీసుకున్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీ స్వీకరిస్తున్న ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి స్పందన కార్యక్రమంలో పెట్టుకున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎపిఒ సూర్యతేజతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మండలంలోని గ్రామాల నుంచి 230కి పైగా అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రధానంగా రెవెన్యూకు సంబంధించి కోర్టు కేసులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, భూ వివాదాలకు సంబంధించి ఎక్కువ అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల సమస్యలపై కొంతమంది అర్జీలు పెట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ప్రధానంగా వంకావారిగూడెం పంచాయతీలో తలపెట్టిన నేవీ ఆయుధ డిపోను తమ గ్రామాల్లో ఏర్పాటు చేయకుండా సర్వే పనులు ఆపాలని పలు గిరిజన సంఘాల నాయకులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభ తీర్మానం, ప్రజల అనుమతి లేకుండా ఎటువంటి పనులూ జరగవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

11వ పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 11వ పిఆర్‌సి బకాయిలు, డిఎ ఏరియర్లు, మెడికల్ బిల్లులు, పిఎఫ్ తదితర వాటిని వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం ఏలూరు యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫాలీ, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు, జిల్లా సహాధ్యక్షులు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్ నేతలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ అధికారుల కక్షపూరిత చర్యలు

తాళాల కోసం అంగన్వాడీల పడిగాపులు



అంగన్‌వాడీ కేంద్ర బయట ఉన్న పిల్లలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అంగన్వాడీ కార్యకర్తలపై ఐసిడిఎస్ అధికారులు కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద సెంటర్స్ తాళాల కోసం అంగన్వాడీలు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం నుంచి అంగన్వాడీలకు సానుకూల నిర్ణయం వెలువడినా అధికారుల నుంచి వేధింపులు మొదలు అయ్యాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అంగన్వాడీలు వ్యక్తిగతంగా వచ్చి డ్యూటీలో జాయిన్ అవుతున్నట్టు లెటర్స్ ఇవ్వాలని కొయ్యలగూడెం సిడిపిఒ ఆదేశాలు జారీ చేశారు. అధికారులు చెప్పినట్టే ఐసిడిఎస్ ఆఫీసుకు వచ్చి డ్యూటీలో జాయిన్ అవుతున్నట్టు వ్యక్తిగతంగా లెటర్స్ ఇచ్చిన ఇంకా, వారి సెంటర్స్ తాళాలు ఇవ్వకుండా సూపర్వైజర్స్ ఇబ్బంది పేడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి.భారతి మాట్లాడుతూ ఉదయం నుంచి ఐసిడిఎస్ ఆఫీసులో పడిగాపులు కాస్తున్న, అధికారులు పట్టించుకోవడంలేదని, సిడిపిఒ అందుబాటులో లేరని సెంటర్స్ దగ్గర అంగన్వాడీలు తాళాల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుక్కునూరు : తాళాలు బద్దలు కొట్టిన వారు తాళాలు ఇచ్చి ఎందుకు స్టాక్ ఇవ్వరు అని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రశ్నించారు. బుధవారం సిఐటియు మండల కమిటీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ 42 రోజుల పాటు సుదీర్ఘంగా పోరాటం చేసి అంగన్వాడీ విజయం సాధించి విధుల్లో జాయిన్ అయితే ప్రభుత్వ సిబ్బంది చాల నిర్లక్ష్యంగా తాళాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి సెంటర్ తాళాలు అప్పచెప్పి, స్టాక్ వివరాలు అందజేయ్యాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విలన్ పాత్రలకు లెనిన్, మార్క్స్ పేర్లు పెట్టడం హేయం



నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు

ఏలూరు అర్బన్ : గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు ప్రపంచ తత్వవేత్త కారల్ మార్క్స్, సోషలిస్ట్ విప్లవ నేత లెనిన్ పేర్లు పెట్టడాన్ని నిరసిస్తూ ఏలూరు ఎస్‌విసి ఐమాక్స్ థియేటర్ వద్ద వామపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వర రావు, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్ధ వెంకటరావులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వర రావులు మాట్లాడుతూ ఈ ప్రపంచంలో మనుషులందరూ సమాన అవకాశాలతో జీవించాలని, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా సోషలిస్టు సమాజం ఏర్పాటు చేయవచ్చని, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి కార్ల్‌మార్క్స్ అన్నారు. ఆ సిద్ధాంతాన్ని మొట్టమొదటగా రష్యాలో ఏర్పాటు చేసి సోషలిస్ట్ సమ సమాజాన్ని స్థాపించిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్ అని కొనియాడారు. సమాజానికి తమ జీవితాలను అంకితం చేసిన మహానీయుల పేర్లు సినిమాలలో విలన్ పాత్రలకు పెట్టటం ఆక్షేపనీయం అన్నారు. సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పట్ల గౌరవం ఉందని, తక్షణమే ఆ పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్, నాయకులు పి.ఆదిశేషు, కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, బి.జగన్నాధ రావు, వైఎస్.కనకారావు, జి.గోపి, సిపిఐ నాయకులు పుప్పాల కన్నబాబు, వామపక్ష పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రపంచ మహనీయులు మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్ పేర్లుగా పెట్టిన దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ బహిరంగ క్షమాపణ చెప్పి మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని సిపిఎం జంగారెడ్డిగూడెం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు అధ్యక్షత వహించగా పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను ఉత్తేజ పరచటానికి తీసే సినిమాలో వారి పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. డబ్బు కోసం గడ్డి తినేందుకు సినిమా రంగంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు మహనీయుల పేర్లు పెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్లు తొలగించాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.సూర్యకిరణ్, పి.దుర్గారావు పాల్గొన్నారు.

మేపాళ కాయలు తిని చిన్నారులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న చిన్నారులు

ఏలూరు అర్బన్ : మేపాళ కాయలు తిని ఎనిమిది మంది పిల్లలు అస్వస్థతకు గురైన సంఘటన నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లా కోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన కార్మికులు పొగాకు పని నిమిత్తం జనవరి రెండవ వారంలో పోతవరం వచ్చారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి పిల్లలకు భోజనం పెట్టగా వారంతా వాంతులు చేసుకోవడం గమనించారు. దాంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు పిల్లలను ఏం తిన్నారు అని అడగగా మేపాళ కాయలు చెట్టు చూపించి అవి తిన్నామని చెప్పారు. దీంతో వెంటనే ఆటో మాట్లాడుకుని ఎనిమిది మంది పిల్లలను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వారికి ప్రథమ చికిత్స చేసి వెంటనే వారిని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ వారిని పరిశీలించిన వైద్యులు వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. వారిని పిల్లల వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన పిల్లలు అంతా మూడు సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల లోపు వారే అవటం గమనార్హం. వీరిలో ముగ్గురు పిల్లలు ఒకే కుటుంబానికి చెందినవారు ఉన్నారు. పిల్లలు అస్వస్థతకు గురి అవ్వటం తమకు ఆందోళన కలిగించిందని, అయితే జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి సెలైన్ పెట్టిన తర్వాత వాంతులు ఆగాయని ముగ్గురు పిల్లల తండ్రి వడ్లమూడి సుబ్బారావు తెలిపారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో జిల్లా ప్రథమం



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జెసి

ఏలూరు : జిల్లాలో నవంబర్ 24న ప్రారంభమైన యాత్ర నేటితో 528 గ్రామ పంచాయతీలు పూర్తిచేసుకోగా, 48,11,11 మందిని భాగస్వామ్యం చేసి కార్యక్రమం అమలులో జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రంలో ఏలూరు, అన్నమయ్య ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలవగా ప్రకాశం తృతీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పథకాలు అమలులో ప్రజలకు అవగాహన కల్పించి, సంతృప్తికర స్థాయిలో అర్హతున్న ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని గత సంవత్సరం నవంబర్ 24న ప్రారంభించింది. వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించామని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తే, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచనలతో జిల్లా యంత్రాంగం 547 గ్రామపంచాయతీలో పక్కా ఏర్పాట్లు చేసుకొని, రోజుకు 10 గ్రామాలు చొప్పున కార్యక్రమం నిర్వహించడానికి కార్యాచరణ చేపట్టింది. దానిలో భాగంగా కేంద్ర పథకాలైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ అన్న యోజన, కిసాన్ సమ్మాన్, జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన, హర్ ఘర్ జల్ జీవన్ మిషన్, కిసాన్ క్రెడిట్ కార్డు, స్వచ్ఛ భారత్ మిషన్, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ముద్ర లోన్, విశ్వకర్మ యోజన తదితర పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడానికి వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని అమలు చేశారు. ముఖ్యంగా భారతదేశం 2047 సంవత్సరానికి స్వతంత్రం వచ్చి శతాబ్దికాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి 45,06,54 మందితో జిల్లాలో సంకల్ప ప్రతిజ్ఞ చేయించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడం విశేషం. ఆయుష్మాన్ భారత్ కార్డులు 4,098 మందికి అందించగా 398 గ్రామ పంచాయతీలకు నూరు శాతం ఆయుష్మాన్ భారత్ సేవలు అందించే స్థాయికి నమోదు చేయడం జరిగింది. అలాగే హర్ ఘర్ జల్ కింద 185 గ్రామ పంచాయతీలను ఎంపిక చేయడం కూడా జిల్లాకు మంచి పేరు తెచ్చిందని చెప్పచు. జిల్లాలో అన్ని గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతం చేయడానికి గత 60 రోజుల నుంచి పర్యవేక్షణ అధికారిగా సేవలందించిన జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్‌ను కలెక్టర్ అభినందించారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 12 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారుల రక్తమార్పిడికి సుమారు 80 నుంచి 100 యూనిట్ల రక్తం అవసరం అవుతుందని అన్నారు. స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు వచ్చి తలసేమియా వ్యాధి చిన్నారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కళా నైపుణ్యం పెంచుకోవాలి

ఏలూరు : కంప్యూటర్ సెక్షన్లతో పాటు ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళా నైపుణ్యం పెంచుకోవాలని అక్షరం ఆర్ట్స్ కార్యదర్శి డి.రాములు కోరారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం 27వ బ్యాచ్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రధానం పవర్‌పేటలోని అన్నే భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ మైనేని లక్ష్మీ స్వాగతం పలకగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అక్షరం ఆర్ట్స్ డి.రాములు, అభినయ నృత్య భారతి డి.హేమ సుందర్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు, వి.సురేష్, డి.గణేష్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.రాములు మాట్లాడుతూ సెట్ వెల్ గుర్తింపుతో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రం రోజురోజుకీ అభివృద్ధి కావాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. అనంతరం 27వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 28 మందికి అతిథులు సర్టిఫికెట్‌లు ప్రధానం చేశారు.

మామిడిపూత పరిశీలన

చాట్రాయి : మండలంలోని కొత్తగూడెం ఆరుగొలనుపేట గ్రామాల్లోని మామిడి తోటల్లో మామిడి పూతను ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ బుధవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మామిడి పూత మూడు దశలుగా ఉంటుందని మొగ్గదశ, పచ్చ పూత దశ, తెల్లపూత దశ ఉంటాయని అన్నారు. పూతదశలో తేనెమంచు పురుగు ఉన్నట్లయితే ఇమిడా క్లోప్రిడ్ 0.5 మిల్లీ గ్రాముకు లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని, మాడు పూత ఉన్నట్లయితే సాఫ్ 2 గ్రాములకు లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని గిరిజనుల వినతి

బుట్టాయగూడెం : మా ఊరు బెడదనూరు, చింతలపూడి ఎత్తిపోతల పథకంలో మా గ్రామం, మేము పూర్వం నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న మా వ్యవసాయ భూములు పూర్తిగా మునిగిపోయాయి. మాకు ఇంతవరకు గ్రామానికి గ్రామం కాని, వ్యవసాయ భూములకు వ్యవసాయ భూములు కాని ప్రభుత్వం వారు అధికారులు ఎక్కడా కేటాయించలేదని బెడదనూరు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కోట రామచంద్రపురం ఐటిడిఎ పిఒకి తమ గోడు విన్నవించుకున్నారు. మా గ్రామానికి గ్రామం, ఇల్లుకు ఇల్లు, వ్యవసాయ భూములకు వ్యవసాయ భూములు ఏర్పాటు చేయాలని బెడదలూరు గ్రామస్తులు పిఒకి వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కూరం రాఘవులు, మడకం పుల్లయ్య పాల్గొన్నారు.

హోంమంత్రి వనితకు ఘన స్వాగతం

ద్వారకా తిరుమల : హోంమంత్రి తానేటి వనిత గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ద్వారకాతిరుమలలో ఈనెల 25న బహిరంగ సభ ఏర్పాటు చేశారు. తానేటి వనితకి ఘనంగా స్వాగతం పలికే విధంగా ఏర్పాటును వైసిపి నాయకులు బొండాడ బి.మోహిని, బి.వెంకన్నబాబు దగ్గరుండి పరిశీలించారు. మీటింగ్‌కు వచ్చే ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అతిరథ మహారథులకు, అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు వైసిపి అభిమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

పోలవరం : మండలంలోని పాత పట్టిసీమ గ్రామంలో దాకే ఆనంద్‌తో కలిసి సుమారు 30 మంది యువత టిడిపి కండువాలను ధరించారు. వైసిపి ప్రభుత్వంలో ఎస్‌సిలకు ఏవిధమైన న్యాయం జరగలేదని, టిడిపిలో ఎస్‌సిలకు న్యాయం జరగడంతో పాటు తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే నమ్మకంతో టిడిపిలో చేరడం జరిగిందని దాకే ఆనంద్ అన్నారు. నూతనంగా పార్టీలోకి చేరిన ఆనంద్, మరో 30 మంది యువతకు టిడిపి పోలవరం ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టిడిపి అధికారంలోకి రాగానే పట్టిసీమ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని బొరగం శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, సర్పంచి సబ్బారపు శ్రీరామ్ మూర్తి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పిల్లి నాగరాజు, నియోజవర్గం బిసి సెల్ అధ్యక్షులు డోకల నాగేశ్వరరావు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, దాకే అభిమన్యుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

28న ఓట్‌ఫర్ ఒపిఎస్

ఏలూరు అర్బన్ : పాత పెన్షన్ సాధనకు ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు రాజమండ్రి ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో జరిగే ఓట్ ఫర్ ఒపిఎస్ సాధన సభ పోస్టర్‌ను జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు షేక్ ముస్తఫాలి, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన్ పెన్షన్ విధానానికి అనుగుణంగా మన రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 2004 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలు అయ్యిందని, ఈ విధానంలో పాత పెన్షన్ విధానం కంటే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని చేసిన ప్రచారం వట్టి బూటకమని తేలిపోయిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఎవరైతే స్పష్టమైన హామీ ఇస్తారో వారికే మా మద్దతు అంటూ ఓట్ ఫర్ ఓపిఎస్ విధానంతో ఈ సభను జరుపుకోబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు, జిల్లా సహాధ్యక్షురాలు వి.కనకదుర్గ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గన్ పౌడర్ పేలి కూలి మృతి

మరొకరి పరిస్థితి విషమం

ముదినేపల్లి : గన్ పౌడర్ (తుపాకీ మందు) పేలి చేపల చెరువుల వద్ద పని చేసే కూలీలిద్దరు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని చినకామనపూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినకామనపూడికి చెందిన ఆక్వా రైతు ఆళ్ల వీరాంజనేయులు చేపల చెరువుపై ఆక్వాను చెందిన బికాస్ బర్, రిటూ బర్ అనే ఇద్దరు కాపలాదారులుగా పని చేస్తున్నారు. వీరు చెరువులపై చేపలు తినేందుకు వచ్చే పిట్టలను తుపాకీతో కాల్చి చంపుతుంటారు. ఈ క్రమంలో వారిద్దరూ మంగళవారం రాత్రి తుపాకీలో వాడేందుకు గన్ పౌడర్ తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తూ మందుగుండు సామాగ్రి పేలింది. ఈ ప్రమాదంలో ఇద్దరి ముఖాలపై తీవ్ర గాయాలయ్యాయి. రిటూ బర్(25)కు ఎడమ చేయి తునాతునకలు కావడం, తలపై బలమైన గాయాలు కావడంతో గుడివాడ ఏరియా ఆస్పత్రిలో మృతి చెందాడు. బికాస్ బర్‌కు తలకు తీవ్ర గాయాలు కావడంతో అతని పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం గుడివాడ నుంచి వైద్యుల సిఫారసు మేరకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం రిటూబర్ మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామ వీఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్షతగాత్రుడు మృతి

నూజివీడు రూరల్ : మండలంలోని వెంకటాద్రిపురం గ్రామంలో కొలుసు నాగేంద్రరావు(62) ప్రమాదంలో గాయపడి విజయవాడలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గౌడ్ తెలిపారు. బుధవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈనెల 21న బైక్‌పై వేగంగా వచ్చిన వ్యక్తి ఢీకొట్టడంతో కాళ్లు విరిగిన నాగేంద్ర రావును విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

మహిళపై కేసు నమోదు

జీలుగుమిల్లి : మండలంలోని దిబ్బగూడెం పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ మహిళ తన వద్ద ఉన్న సంచిలో 8 లీటర్ల నాటు సారాను పెట్టుకొని నడుచుకుంటూ వెళ్తుండగా పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఆమె వద్ద వున్న నాటుసారాను సీజ్ చేసి మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వేడెక్కిన చింతలపూడి రాజకీయం..!

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో ఉపఎన్నికల సమరం దగ్గర పడుతున్న కొద్దీ రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి. చింతలపూడి నియోజకవర్గం 1962లో ఏర్పడింది. అప్పటి నుంచి నేటి వరకు అభివృద్ధిలో వెనుకబడింది. మొదటి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా రేపల్లెగడ్డ ఏసుపాదం గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ ఐదు స్లారు, టిడిపి ఐదు స్లారు, వైసిపి ఒక్కసారి గెలుపొందింది. 1955లో ఎన్నికల్లో కోటగిరి విద్యాధరరావు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది అనంతరం టిడిపిలో చేరారు. అనంతరం నాలుగు స్లారు టిడిపి నుంచి గెలుపొంది చింతలపూడి నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చేశారు.



అభ్యర్థులు మారినా అభివృద్ధి శూన్యం..!

చింతలపూడి నియోజకవర్గం నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. గత పాలకులు చేసిన తప్పిదాలు, నేటి అభ్యర్థులకు సమస్యలు సవాల్ విసురుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు తదితర సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయి. ఏ పార్టీ అభ్యర్థులు ఏ పార్టీ అయినా పాలించడం కత్తిమీద సాముగా మారింది.

చింతలపూడి నియోజకవర్గంలో 2 లక్షల 72,502 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారు సుమారు 90 వేల మంది నుంచి లక్ష వరకూ ఉన్నారు. సుమారు కాపు ఓటర్లు 40 వేల వరకూ, కమ్మ సామాజిక వర్గం ఓటర్లు 30 వేలు, రెడ్డి సామాజిక వర్గం 25 ఓటర్లు, బిసి సామాజిక వర్గం ఓటర్లు 30 వేలు, మిగిలిన వెలమ, మైనార్టీలు, ఇతర కులాల సామాజిక వర్గాల ఓటర్లు ఉన్నారు.

టిడిపి అభ్యర్థులపై తర్జన భర్జన!

చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిపై అధిష్టానం తర్జనభర్జన పడుతోంది. 2019 ఎన్నికల తరువాత నేటికీ టిడిపి ఇన్‌ఛార్జి వేయని పరిస్థితి. ఇప్పటికే ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అభ్యర్థులతో పాటు నియోజకవర్గ ప్రజలలో ఉత్కంఠ నెలకొంది. అయినా అధిష్టానం గెలుపు గుర్రానికే టికెట్ ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే అభ్యర్థులు బొమ్మాజి అనిల్ సొంగా రోషన్ కుమార్, ఆకుమర్తి రామారావు, పీతల సుజాత పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా జనసేన, టిడిపి పొత్తులో భాగంగా ప్రజారాజ్యం తరుపున పోటీ చేసిన వ్యక్తి మళ్లీ పోటీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

చింతలపూడి నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి విజయరాజుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వాటిని ఎలా అధిగమించి ముందుకెళ్తారో, ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారో తెలియని పరిస్థితి.

మండల ప్రజల్లో వ్యతిరేకత!

చింతలపూడి మండల ప్రజల్లో వైసిపిపై వ్యతిరేకత కనిపిస్తోంది. గ్రామాల్లో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, ఆంధ్రా కాలువ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, రైతులకు న్యాయం చేయకపోవడం, చింతలపూడి-నామవరం రోడ్డు, చింతలపూడి బస్సు డిపో, ప్రధాన రహదారులు పెద్ద పెద్దగుంతలతో దర్శనమిస్తున్నాయి. వీటిని ఎలా అధిగమిస్తారో తెలియని పరిస్థితి. చింతలపూడి మండలం నియోజకవర్గానికి ప్రధాన కేంద్రం అయినా, నేటికీ మండలం వెనుకబడే ఉంది. వచ్చిన అభ్యర్థులందరూ జంగారెడ్డిగూడెంలో ఎక్కువగా ఉండటంతో జంగారెడ్డిగూడెం అభివృద్ధిలో ముందుందని, చింతలపూడిపై సవితి ప్రేమ చూపించడంతో వెనుకబడి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వీటన్నింటిని విజయరాజుకు గతంలో రవాణాశాఖ అధికారి పనిచేసిన అనుభవం, 2014లో బలంగా ఎంఎల్‌ఎ టికెట్ కోసం పోటీ పడటం, ప్రతీ మండలంలో బంధువర్గం, పాత పరిచయాలు, లోకల్ అభ్యర్థి అవ్వడం ఆయనకు కలిసివచ్చే అంశం.

గెలుపు అంత ఈజీ కాదు..

చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి, జనసేన, వైసిపి అభ్యర్థుల గెలుపు అంత సులువుగా ఉండదని తెలుస్తోంది. ప్రజలు ఎప్పుడు ఎటువైపు ఓటు వేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి పార్టీలో వర్గపోరు ఉండటం, వారు ఎన్నికలకు ఎలా సిద్ధం అవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఏ పార్టీ అయినా విజయం సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

జగనన్న కాలనీకి మోక్షమెప్పుడో..!

లే అవుట్‌కు మార్గం లేక లబ్ధిదారుల అవస్థలు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నిజం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర మంతటా లబ్ధిదారులకు సెంటున్నర స్థలంలో ఇళ్లు కట్టుకునేలా లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల కోత మిషన్ వెనుక భాగంలో సుమారు 100 మందికి స్థలాలు కేటాయించి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు అక్కడ ఎటువంటి పురోగతి లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్షన్స్ దగ్గర పడుతున్నా వారి గోడు పట్టించుకునే నాధుడే లేడని తీవ్ర నిరాశ చెందుతున్నారు. అప్పుడు లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలను దగ్గరుండి చూపించి ఫోటోలు కూడా తీయించి ఇళ్ల పట్టాల పత్రాలను ఇవ్వడం జరిగింది. కాని ఇప్పటివరకు లబ్ధిదారులు ఎలాంటి ఇళ్ల నిర్మాణాలను మొదలు పెట్టుకోలేని పరిస్థితి. దీనికి ఇళ్ల స్థలాలను కేటాయించినప్పుడు మార్గం ఉంది, ఇప్పుడు ఆ మార్గం ఏమైందో తెలియట్లేదు. అదేవిధంగా నాయకుల్ని, అధికారుల్ని పలుమార్లు లబ్ధిదారులు అడగడం జరిగింది కాని వారు ఎప్పుడూ చెప్పే మాటలే ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తాం.. అంటూ కాలం గడిచిపోయింది కాని దారి ఏర్పడలేదు. ఇప్పుడు అక్కడ పరిస్థితి ఎలా ఉందంటే లబ్ధిదారులు వారి స్థలాలను కూడా గుర్తుపట్టలేని పరిస్థితిలో ఉంది. దట్టంగా మొక్కలు పెరిగి దారి లేక చాలా దయనీయంగా ఉంది. చుట్టుపక్కల గ్రామాలు ఇప్పటికే ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని చాలా సంతోషంగా ఉన్నారు. కాని దానికి భిన్నంగా ద్వారకాతిరుమల లబ్ధిదారులు దిక్కు తోచని


మార్గంలేక దట్టంగా పేరుకుపోయిన లేఅవుట్

స్థితిలో ఉన్నారు. దీనికి కారకులు ఎవరు? ప్రభుత్వాన్నిదా? అధికారులదా? లేక నాయకులదా? ఇంతకీ వారికి ఇల్లు ఉన్నట్టా లేనట్టా? ఇల్లు నిర్మించుకుందామన్న మెటీరియల్ తీసుకెళ్లటకు మార్గం లేక ఇబ్బంది పడుతున్నామని, పూర్వము మార్గము వున్నా ప్రస్తుతము ఆ మార్గము వేరే వ్యక్తుల ఆధీనంలో ఉందని, తహశీల్దార్ పరిశీలించి వెంటనే పూర్వపు మార్గాన్ని పునరుద్ధరణ చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

నూజివీడు రూరల్: పట్టణంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను బుధవారం సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్మన్ గుడిమల్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చేతకాని హామీలతో టోకరా : చింతమనేని

ఏలూరు టౌన్: సిఎంగా గద్దె నెక్కడం కోసం తనకు చేతకాని హామీలను సైతం అమలు చేస్తానని వాగ్దానాలు ఇచ్చి నేడు మహిళాలోకాన్ని అన్ని విధాలా మోసం చేసిన వ్యక్తి సిఎం జగన్ అని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం అప్పన్నవీడులో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం బాబుకు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 6 పథకాల విశిష్టతను గ్రామస్థులకు వివరించారు.

టి.నరసాపురం : మండలంలోని మర్రిగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న తీగలపల్లీ గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు పొట్టా రామారావు నాయకత్వంలో నాయకులు ఇంటింటికి తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజా లోకేష్, తుట్టి చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఉంగుటూరు : అర్హులైన ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్న పేదలకు 90 రోజుల్లో పట్టాలు పంపిణీ చేయడం వైకాపా ప్రభుత్వానికే సాధ్యం అవుతోందని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో 39 మందికి ఇంటి స్థలాలను సిద్ధం చేసి వాటి పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఉంగుటూరు 16, ఉప్పాకపాడు 5, నాచుగుంట 7, వివపురం 7, నల్లమాడు 1, కంసాలిగుంట 2, నీలాద్రిపురం 1 పంపిణీ చేశారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, వైకాపా మండల కన్వీనర్ మరడ మంగారావు, నాయకులు కూనా పోతురాజు పాల్గొన్నారు.

ఒకే ఇంటిలో ముగ్గురికి వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగాలు

ఉంగుటూరు : కష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివి ఒకే ఇంటిలో ముగ్గురూ వెటర్నరీ అసిస్టెంటు ఉద్యోగాలు పొందడం ఆదర్శనీయమని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామానికి చెందిన కొరపాటి వెంకటకృష్ణ, అతని భార్య రాజేశ్వరి, చెల్లెలు కొరపాటి పూజ ఈ ముగ్గురూ పరీక్షలు రాసి అందులో విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధిగా నాగరాజు

ఏలూరు టౌన్: టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధిగా ఏలూరుకు చెందిన వివి.ఎన్ గనప్పగిరావు(వానపల్లి నాగరాజు)ను నియమించారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చన్న నాయుడు ఉత్తర్యులు జారీ చేశారు. రాష్ట్రంలో టిడిపి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రతిభకు ఓటి పరీక్షలు దోహదం

ఏలూరు స్పోర్ట్స్ : విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు ఓటి పరీక్షలు ఒక వేదికగా నిలుస్తాయని ప్రతి ఒక్క విద్యార్థిలోని ప్రతిభను బయటకు తీసే బాధ్యత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులపై ఉంటుందని చైతన్య ఒలంపియాడ్ పాఠశాల ప్రిన్సిపల్ లిల్లీషా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ జరుగుతుంది. ఈ టెస్టుల్లో విద్యానగర్‌లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు మ్యాథ్స్ అసెస్మెంట్ టెస్టులు 21 మంది, ఫిజికల్ అసెస్మెంట్ టెస్టుల 17, కెమిస్ట్రీ అసెస్మెంట్ టెస్టుల్లో 16 మంది మొత్తం 54 మంది విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా రెండవ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపల్ ఎల్లిశా వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోని ప్రతిభను వెలిగితే బాధ్యత తమపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం పార్థసారథి, రీజినల్ ఇన్‌ఛార్జి ఉదయభాస్కర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిచయ కార్యక్రమానికి తరలిన వైసిపి శ్రేణులు

టి.నరసాపురం : పోలవరం నియోజకవర్గ పరిధిలోని కొయ్యలగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన వైసిపి ఏలూరు పార్లమెంటు అభ్యర్థి కారుమూరి అనిల్ కుమార్, పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పరిచయ కార్యక్రమానికి మండలం నుంచి బుధవారం వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో వైసిపి మండల నాయకులు దేవరపల్లి ముత్తయ్య, కాల్నీడు సుబ్బారావు, పిన్నమనేని చక్రవర్తి, వాసిరెడ్డి మధు, మక్కిన గోపాలరావు ఉన్నారు.

తనిఖీలు ముమ్మరం : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించి తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి మేరీ ప్రశాంతి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ పరిధిలో పోలీసు అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలు రానున్న నేపథ్యంలో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు ఎంజెవి.భాస్కరరావు, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

మండవల్లి: ఓటు ఒక వజ్రాయుధమని, రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. జనవరి 25న 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండవల్లిలోని ఇండియన్ బ్యాంక్ సమీపంలో స్టేషన్ రోడ్ సెంటర్‌లో ఓటర్ల దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు, సభ్యులు బుద్ధుల రాముడు పాల్గొన్నారు.

వీణల తయారీ కేంద్రం సందర్శన

నూజివీడు రూరల్: పట్టణంలో వీణల తయారీ దారుడు షేక్ మాబు వీణల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బడిగించాలా జయలక్ష్మి బుధవారం సందర్శించారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బడిగించాల చంద్రమౌళి పాల్గొన్నారు.

యాంత్రిక పనిముట్లపై అవగాహన


జీలుగుమిల్లి : పొగాకు సాగులో కూలీల కొరత వల్ల యాంత్రిక పనిముట్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పించినట్లు సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిటిఆర్ఐలో రైతులకు పొగాకు సాగులో యాంత్రిక పనిముట్ల వాడకంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సిటిఆర్ఐ పరిధిలోని పొగాకు పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసాద్, సరళ, ఆర్ఎమ్.ఆది శేషయ్య పాల్గొన్నారు.

మాలమహానాడు యూత్ కార్యదర్శిగా మోహన్‌కుమార్

ముదినేపల్లి : రాష్ట్ర మాల మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు కమిటీలో మట్ట మోహన్ కుమార్‌ను కైకలూరు నియోజకవర్గం మాల మహానాడు యూత్ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని బుధవారం బాబురావు మోహన్ కుమార్‌కు అందజేశారు. అనంతరం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ మోహన్ కుమార్ ఈ పదవి ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు అనుకూలంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షులు ఏసు పోగు దానియేలు, చీలి లావణ్య పాల్గొన్నారు.

'మరలా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలి'

ముసునూరు: ప్రతి మహిళ అన్ని పథకాల లబ్ధి చేకూరాలంటే మరలా జగన్మోహన్‌రెడ్డిని సిఎం చేయాలని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు డ్వాక్రా మహిళలనుద్దేశించి పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన ముసునూరు హైస్కూల్‌లో ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి ఓడిపోయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండాదుర్గభవానీ వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధరరావు, సర్పంచులు పేరం కృష్ణ, రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, రంగు ధనలక్ష్మి, కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, ఎంపిటిసిలు, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బివి.సత్యనారాయణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎంఎల్ఎ

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ముసునూరు: బిసిలు అంతా ఏకమై టిడిపికి అండగా ఉండి తమను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు రైస్‌మిల్ సెంటర్ వద్ద జయహో బిసి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు దేవినేని ధలరామ్, కొల్లి గంగారం, పాకనాటి సీతారామ్, ఆంజనేయులు, గారపాటి నరసింహారావు, మెదరమెట్ల సురేంద్ర, తోట శ్రీను, కందుల పిచ్చయ్య, మాజీ జెడ్‌పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముద్దరబోయిన

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ముదినేపల్లి : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు బుధవారం ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత మండలంలోని చేవూరు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం రూ.10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం సింగరాయపాలెంలో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్ సునీత, రాచూరి రాధా పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

చింతలపూడి : విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని చింతలపూడి జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్, ఎంపిపి రాంబాబు అన్నారు. చింతలపూడి పట్టణంలోని వెంకటాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ జిల్లా పరిషత్ వారి సహకారంతో మండల విద్యాశాఖాధికారి కిరణ్ బాబు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పోలవరం : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి చూడామణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, పోలవరం సర్పంచి పాడుం పుష్ప, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ పాల్గొని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.లక్ష్మీకాంతం, పొడెం శ్యాం కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ఏలూరు టౌన్ : ఇంటి మహాలక్ష్మి బాలికలేనని ఏలూరు దిశా పోలీస్ స్టేషన్ మహిళా సబ్ ఇన్స్పెక్టర్ కాంతి ప్రియ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు ఏలూరు సుబ్బమ్మ దేవి హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతి ప్రియ మాట్లాడుతూ మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్యం న్యాయం అనే పుస్తకాన్ని సిహెచ్.సూర్య చక్రవేణి ఆవిష్కరించారు.

'టిడిపితోనే బిసిలకు న్యాయం'

పోలవరం : వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిసిలకు తీరని అన్యాయం జరిగిందని పోలవరం నియోజవర్గం బిసి సెల్ అధ్యక్షులు డోకల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మంచి చేయాలని స్థాపించిన పార్టీ టిడిపి అని అన్నారు. టిడిపి హయాంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేదన్నారు. ఎన్నికల్లో టిడిపి గెలవడం ఖాయమని, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, పోలవరానికి ఎంఎల్ఎగా బొరగం శ్రీనివాసు గెలుపొంది తీరుతారని ధీమా వ్యక్తం చేశారు.

మహిళా ఓటర్లు అత్యధికం

నూజివీడు రూరల్ : నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అధికారులు తాజాగా విడుదల చేసిన ఓటర్ లిస్ట్ ప్రకారం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,19,730, పురుషులు 1,17,398 ఉండగా, కొత్తగా 3,944 ఓటర్లు నమోదు అయ్యారు. నూజివీడు టౌన్‌లో 56,603, మండలంలో 42,262, ముసునూరులో 22,743, చాట్రాయిలో 43,022, ఆగిరిపల్లిలో 49,949 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 23 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు.

వికలాంగురాలికి సాయం

నూజివీడు రూరల్: నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తన కార్యాలయంలో బుధవారం పేద వికలాంగురాలికి సహాయం చేశారు. ఆగిరిపల్లి మండలం సగ్గురు గ్రామానికి చెందిన ఉప్పలూరు జోత్స్నకు రూ.4 లక్షల 20 వేల విలువ కలిగిన వినికిడి యంత్రం తన సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్ కుమార్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

చాట్రాయి : మండలంలోని చనుబండ జెడ్‌పి పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనకు వచ్చిన సబ్ కలెక్టర్‌తో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాల పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ రంగారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

'కార్మికులకు ఉచిత న్యాయ సహాయం'

ఏలూరు అర్బన్ : అన్ని రంగాల కార్మికులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయమందిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో భవన కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు పాల్గొన్నారు.

పెదవేగిలో మాక్ ఎక్సర్‌సైజ్

పెదవేగి : పెదవేగి మండలం నడిపల్లిలో బుధవారం ప్రసాద్ సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో మాక్ ఎక్సర్‌సైజ్(ఎల్‌పిజి లీక్ అండ్ ఫైర్) నిర్వహించారు. ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజవలి సమక్షంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ వారి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జాగ్రత్త

ఏలూరు టౌన్: మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు చెప్పారు. బుధవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరు బెనర్జీ పేటలోని బాలగంగాధర్ తిలక్ ఓరియంటెడ్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నవ జీవన్ జోనల్ కోఆర్డినేటర్స్ బి.నేహెమ్య, వి.జయాపాల్ పాల్గొన్నారు.